# 5

విజయకు విసుగు వచ్చింది. బస్సు ఇంకా రాలేదు.

ఎండ మండిపోతోంది. పల్లైనా, చెట్టునీడైనా మిగలని రోడ్డు మీద నిలబడి వుంది. ఆమె ఉక్కపోతకు సతమతమవుతూ ఏం చెయ్యాలో తోచక అటూ ఇటూ చూసింది.

"కూర్చోండి" రోడ్డు వారగా వున్న, కిళ్లీ బడ్డీవాడు, బడ్డీ వారగా వున్న నీడలో ఒక స్టూల్ వేసి మళ్లీ అన్నాడు. "కూర్చోండమ్మా"

స్టూల్ మీద కూర్చుంది, విజయ కట్టుకున్న పట్టుచీర పమిట సర్దుకుంది. చేతులని అలంకరించిన డజన్ బంగారు గాజులని ఒకసారిపైకి జరుపుకుంది. మెడ నిండుగా వున్న గొలుసు సవరించుకొని, వజ్రాల నెక్‌లెస్ ఒకసారి తడిమి చూసుకుంది. నల్ల పూసలగొలుసు పమిటపైకి వేసుకొని, రోడ్డు మీదకు దృష్టి మళ్లించింది. రోడ్డు నిర్మానుష్యంగా వుంది. వాహనాలు అరుదుగా కనబడ్డాయి.

ప్రపంచ పాఠశాలని శాసించే చండశాసనుడైన సూర్యుడు మండిపడుతున్నాడన్నాడని కదలకుండా, ఎక్కడికక్కడే, వుండిపోయిన పిల్లల బడిలా వుంది, ఊరు.

మరికొంత సేపు వుండమని పెళ్లివారు బతిమాలినా, భోజనం ముగించగానే బయలుదేరినందుకు, తనని తానే తిట్టుకుంది, విజయ అక్కడే వుండి ఎండ తగ్గాక వచ్చివుంటే, బాగుండేదని అనిపించింది. కర్చీఫు తీసి, మోము,మెడ వొత్తుకొని, గట్టిగా నిట్టూర్చింది ఆమె.

నిజం చెప్పాలంటే, విజయ పెళ్లికి రావటం ఆమె భర్తకి ఇష్టం లేదు. ఎప్పుడో పదిహేనేళ్ల క్రితం ఆమెతో కలసిపనిచేసిన టీచర్ గారి

అమ్మాయి పెళ్లి ఆమె ఇంటి నుంచి గంటకు పైగా ప్రయాణం చేస్తేగాని ఆ ఊరు చేరుకోలేరు. పట్నము కాదు. పల్లెకాదు అనే రకం ఊరు పదేళ్లు దాటిన ఆడపిల్లలాంటి ఊరు. ఆ ఊరుకి బస్సు సదుపాయం అంతంత మాత్రమే ఆటోకి అనువైన దూరం కూడా కాదు. అందువల్ల శుభాకాంక్షలు పంపి వూరుకోమని చెప్పారు. ఆమెభర్త.

కాని, విజయ  ససేమిరా ఒప్పుకోలేదు. తన స్నేహితురాళ్లని ఒకప్పటి సహోద్యోగులని కలవటానికి సువర్ణావకాశమని వాదించి, అతికష్టం మీద భర్తని వొప్పించి బయలు దేరింది. కాని విజయ మనస్సులో అనుకున్నది మరొక్కటి.

గత పదిహేను సంవత్సరాలలో, ఆర్థికంగా బాగా ఎదిగిన విషయం చాలా కాలంగా కలవని స్నేహితురాళ్లకు తెలియపరచాలనేది ఆమె తపన. ఒకప్పుడు, మెడలో వుత్త పసుపు తాడుతోనూ, చేతులో మట్టిగాజులతోనూ, గడిపిన తనకు ఇప్పుడు రవ్వల నెక్లసు, రకరకాల గొలుసులు డజన్లకొద్ది బంగారు గాజులు వున్నాయని తెలియపరచాలంటే పెళ్లికి వెళ్లవలసినదే అని అనుకుంది. ఆర్థిక స్తోమత ప్రదర్శనకి పెళ్లిళ్లకు మించిన వేదిక లేదుకదా!

హాయిగా తనలో తను నవ్వుకుంది విజయ. ఒకసారి చేతులు కదిపింది. మెడలో వున్న ఆభరణాలని తడిమి చూసుకొని సంతృప్తిగా నవ్వింది. కనీసం రెండు లక్షలకు పైగా ఖరీదు చేసే ఆభరణాలున్నాయి ఆమె ఒంటిమీద.

"టీచర్" ఆ పిలుపుకు ఉలిక్కిపడి చూసింది విజయ. సుమారు, ముప్పైయ్యేళ్ల యువకుడొకడు ఆమెకు దగ్గరగా నిలబడి వున్నాడు.

"టీచర్, నేనేనండి" ఆ యువకుడు అన్నాడు "నేను పార్థసారధినండి."

ఆమె స్పందించలేదు. ఏ పార్థసారథి?

"మీరు నన్ను గుర్తు పట్టినట్టు లేరు, టీచర్" అతడు మళ్లీ అన్నాడు.

"నేను మీ స్టూడెంటునండి, అయిదోక్లాసులో"

విజయ అతన్ని ప్రశ్నార్థకంగా చూసింది. నలుబది సంవత్సరాల అధ్యాపక వృత్తిలో ఎందరో పార్థసారథులు, ప్రసాదులు, శ్రీనివాసులు!

"మీరు నన్ను ఆట సారథి అని పిలిచేవారండి..."

"ఓ నీవా?" ఆమె మదిలో గత కాలపు 'రీలు' మెల్లిగా కదలింది. మరిచిపోలేని అల్లరి చేసే పార్థసారథి పసిమోము ఆరీలులో సజీవంగా వుంది. వాడు, ఇప్పుడు...?

"వెంటనే గుర్తు రాలేదు" విజయ అంది "పెద్దవాడైనావు కదా! ఏం చేస్తున్నావు, ఇప్పుడు...?"

"గల్ఫ్‌లో పని చేస్తున్నానండి, సెలవులో వచ్చాను. మీరు ఇక్కడ.."

"లక్ష్మి టీచరు ఇంటికి వచ్చాను. ఆవిడ అమ్మాయి పెళ్లి".

"లక్ష్మి టీచర్ అంటే.. అప్పుడు 'బి సెక్షన్ కదూ, మీరు 'ఎ' సెక్షన్".

"బాగా గుర్తుందే".

"గుర్తుండదేమిటండి?" అతడు అన్నాడు. "ఈరోజు నేనిలా వున్నానంటే మీ వల్లే కదండి. మీలాంటి టీచర్లు వేసిన పునాది వల్లే కదండి?"

విజయ కళ్లు చమర్చా యి. విద్యార్థులని తమ బిడ్డలుగా భావించి అంకిత భావంతో పని చేసే ఉత్తమ అధ్యాపకులకు ఆ మాటలకన్నా గురుదక్షిణ వేరే ఏం కావాలి!

తమ చిన్ననాటి విశేషాలు, తనతో చదువుకున్న వారి వివరాలు మాట్లాడాడు. పార్థసారథి. ఆమె తోటి టీచర్ల గురించి అడిగాడు. బ్రీఫ్ కేసు తెరిచి ఒక చిన్న పాకెట్టు విజయకు ఇచ్చి వెళ్లిపోయాడు.

పార్థసారథి వెళ్లిపోయినా, విజయ ఆలోచనలు, ఆమె విద్యార్థుల చుట్టూ తిరిగాయి. ఏ ఊరు వెళ్లినా ఒకరిద్దరు విద్యార్థులు కనబడుతూ వుంటారు. ఆప్యాయంగా పలకరించి మాట్లాడుతూ వుంటారు. ఒక మంచి అధ్యాపకులకి శిష్యులకు మించిన సంపద ఏముంది!

ఉక్కపోత ఎక్కువైంది. చమట వానలా ప్రవహించింది. నాలిక ఎండింది. నీరసం ఎక్కువైంది. బలవంతంగా తెరిచినా, కళ్లు మూతలు పడ్డాయి.

“లక్ష్మీ టీచర్ ఇంటికి వచ్చారండి?”

తుళ్లిపడి లేచింది, విజయ. ఎదురుగా నిలబడి వున్నాడు ఒక యువకుడు. “మేమూ అక్కడ నుంచే” అతడు అన్నాడు “అక్కడ మిమ్మల్ని చూసాం. మాట్లాడాలని వచ్చేలోగా మీరెటో వెళ్లిపోయారు”.

“అవునండి”. అతని పక్కనే నిలబడి వున్న అమ్మాయి అంది

“నా భార్య” అతడు ఆమెని పరిచయం చేసాడు.

ఒక నిమిషం అలా వుండి పోయింది విజయ. ఆతరువాత అడిగింది. “మీరు..’

“మీరని అంటారేమిటండి?” అతడు అన్నాడు “నేను మీ స్టూడెంటునేనండి, అయిదో తరగతిలో అప్పుడు, నేను, పార్థసారథి కలిసి చేసిన అల్లర్లు..”

“నీవుప్రసాదువా...”

“అవునండి..”

“నిన్ను చూసి పోల్చుకోలేక పోయానయ్యా. చిన్నప్పటి పోలికలు అస్సలే లేవు”.

“ఇప్పుడే కనబడ్డాడండి, పార్థసారథి, సెలవులో వచ్చాడు కదా!”

“ఇద్దరూ చాలా సేపు మాట్లాడుకున్నారండి”, ప్రసాద్ భార్య అంది.

"మీ గురించే"

"ఇప్పుడేం చేస్తున్నావు?"

"ఏం చెప్పనండి.. డ్రైవరుగా చేస్తున్నానండి. చిన్నప్పుడు మీ మాటలు వినక అల్లరులు చేస్తూ చదవటం మానేసాను, కదండి, అందుకే.."

"బాధపడకు ప్రసాద్. ఇప్పుడు బాధపడి ప్రయోజన మేమిటి?" ఆమె అతన్ని స్వాంతన పరిచింది. ఆ తరువాత అడిగింది "ఈ ఊరులో వుంటున్నావా?"

"లేదండి, సిటీలో వుంటున్నాం."

"మరి ఇక్కడ..."

"టీచర్‌గారి ఇంటికి పెళ్ళికి వచ్చామండి. ఈవిడకి లక్ష్మి టీచర్ చుట్టం".

"మీరూ సిటీకేగా?" ప్రసాద్ అన్నాడు. "ఇంకో గంటదాక బస్సు లేదండి".

ఆలోచనలో పడింది విజయ.

మరో అరగంట గడిచింది. బస్సు రాలేదు.

మరికొన్ని కబుర్లు చెప్పుకోవటం వల్ల మరికొంత దగ్గరైనారు వాళ్లు.

"రండి, టీచర్" మళ్ళీ బతిమాలాడు ప్రసాద్.

అలసిపోవటం వల్లనైతే నేమి, ప్రసాద్ దంపతుల బలవంతం వల్లనైతేనేమి కారెక్కింది ఆమె.

కారు కదిలింది.

తను తెచ్చుకున్న ఫ్లాస్కులో నుంచి చల్లటినీళ్లు ఇచ్చింది, ప్రసాద్ భార్య. ఏ.సి. కారులోని చల్లదనానికి ఎండలో నిలబడి అలసిపోయిన

ఆమె కళ్లు మూతలు పడ్డాయి.

కారు పరుగెత్తింది.

మరో అరగంట తరువాత వీపు మీద ఏదో గుచ్చుకుంటున్నట్టు అనిపించి బలవంతంగా కళ్లు తెరవటానికి ప్రయత్నించింది విజయ. కాని కనురెప్పలు విడవలేదు.

ఆమెని కారెక్కించుకున్నవారు, ఒంటిమీద బంగారమంతా దోచుకున్నారని, ప్రసాద్ నిజంగా ఆమె విద్యార్థి కాదని, పార్థసారథితో మాట్లాడటం విని వచ్చిన దొంగ అని రోడ్డు వారగా, పొదలలో పడివున్న విజయకి ఏం తెలిస్తుంది పాపం! లోగుట్టు పెరుమాళ్లకెరుక!